రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్
బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పూలపండుగ బతుకమ్మ ముగింపు చివరి రోజు 'సద్దుల బతుకమ్మ'ను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం నుంచి పుట్టిన ప్రకృతి పండుగే బతుకమ్మ పండుగ అని సీఎం అన్నారు. దేవీదేవతలను అర్చించే పువ్వులే బతుకమ్మగా పూజలందుకోవటం తెలంగాణ ప్రజలకు ప్రకృతి పట్ల ఉన్న ఆరాధన, కృతజ్ఞతాభావనను తెలియజేస్తాయని చెప్పారు. సబ్బండ వర్గాలు సమిష్టిగా జరుపుకొనే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని తెలిపారు. పచ్చదనం, పాడి పంటలు, పశుసంపద, ప్రకృతి వనరుల సమృద్ధితో నేడు తెలంగాణ నిండైన బతుకమ్మను తలపిస్తున్నదని వెల్లడించారు. బతుకమ్మల నిమజ్జన సమయంలో స్వీయ జాగ్రత్తలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని జగన్మాత గౌరీదేవిని ప్రార్థించారు.

- **దుర్గాదేవిగా పర్వత వర్ధిని**

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి అష్టోత్తరం, లలితా సహస్ర నామార్చన, పారాయణాలు, జపాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన చేశారు.
– యాదగిరిగుట్ట

కారుదే సర్కార్.. హ్యాట్రిక్ కేసీఆర్

- **బీఆర్ఎస్‌కు 70కిపైగా సీట్లు**
- **తేల్చిన ఇండియా-సీఎన్ఎక్స్ సర్వే**
- **34 సీట్లలోపే కాంగ్రెస్ పరిమితం**
- **ఫ్యాక్ట్స్‌మార్కెటింగ్ రీసెర్చ్‌దీ అదేమాట**
- **గులాబీకే 73 నుంచి 78 సీట్లు పక్కా**
- **కాంగ్రెస్‌కు దక్కేది 25-30 సీట్లే**
- **42.5% ఓట్లతో బీఆర్ఎస్ విజయం**
- **ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరు భేష్ అంటున్న ఓటర్లు**

ఫ్యాక్ట్స్ సర్వేలో బీఆర్ఎస్‌కు 73-78 సీట్లు

ఫ్యాక్ట్స్ మార్కెటింగ్ అండ్ రిసెర్చ్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రీపోల్ సర్వేలో బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ది ఏకపక్ష గెలుపేనని స్పష్టం చేసింది. మొత్తం 119 స్థానాలకుగాను బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 73-78 సీట్లు గెలుచుకోబోతున్నదని వెల్లడించింది. తద్వారా బీఆర్ఎస్ మళ్లీ అధికార పీఠాన్ని దక్కించుకుంటుందని పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా 17,850 పోలింగ్ కేంద్రాల్లో 1.12 లక్షల మంది ఓటర్ల అభిప్రాయాలను ఈ సంస్థ సేకరించి సర్వే నిర్వహించింది. ఇందులో మెజార్టీ ఓటర్లు బీఆర్ఎస్ వైపు నిలిచారు. కాంగ్రెస్‌కు 25-30 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నదని సర్వే పేర్కొన్నది. బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితయ్యే పరిస్థితి ఉన్నదని వెల్లడించింది. బీజేపీకి 6-10 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపింది. ఎంఐఎంకు 7-8 సీట్లు, ఇతరులకు ఒక సీటు వస్తుందని పేర్కొన్నది.

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరోసారి అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని సర్వేలు తేల్చి చెప్పాయి. శనివారం విడుదలైన రెండు సర్వే సంస్థల రిపోర్టుల్లో బీఆర్ఎస్ పార్టీ 70కి పైగా సీట్లు గెలుచుకొంటుందని తేలింది. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నాయి. అసెంబ్లీ ఎన్నికలపై ఇండియా టీవీ, ఫ్యాక్ట్స్ మార్కెటింగ్ అండ్ రిసెర్చ్ సర్వీసెస్ సంస్థలు వేర్వేరుగా సర్వేలు నిర్వహించాయి. ఈ రెండు సర్వేల్లోనూ బీఆర్ఎస్ సాధారణ మెజార్టీకి మించి స్థానాలు గెలుచుకొంటుందని తేలింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ 30 సీట్ల వద్దే ఆగిపోతుందని పేర్కొన్నాయి. ఇక బీజేపీకి సింగిల్ డిజిట్ సీట్లు దాటవని స్పష్టం చేశాయి. ఈ ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టనున్నారని తేలిపోయింది.

ఇండియా టీవీ సర్వేలో బీఆర్ఎస్ 70 స్థానాలు

ప్రముఖ జాతీయ టీవీ చానల్ ఇండియా టీవీ నిర్వహించిన సర్వేలోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. ఈ సర్వేలో బీఆర్ఎస్ పార్టీ 70 సీట్లు గెలుచుకుంటుందని వెల్లడించింది. కాంగ్రెస్‌కు 34 సీట్లు మాత్రమే వస్తాయని పేర్కొన్నది. ఇక ఈ సర్వే ప్రకారం బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కానున్నది. ఈ ఎన్నికల్లో బీజేపీ కేవలం 7 స్థానాలు మాత్రమే గెలుచుకుంటుందని తెలిపింది. ఎంఐఎం కూడా 7 స్థానాలు గెలుచుకుంటుందని, ఇతరులు ఒక స్థానాన్ని గెలుచుకుంటారని సర్వే తేల్చింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఓట్ల తేడా 10 శాతం..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేశామన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నది. కానీ బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ఓట్ల పరంగా దాదాపు పది శాతం వెనుకబడి ఉన్నదని తాజా సర్వేలు తేల్చాయి. బీఆర్ఎస్‌కు 42.5 శాతం, కాంగ్రెస్ 33.1 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించాయి. అంటే ఈ రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 9.4 శాతం. ఓట్ల తేడా రెండుమూడు శాతం వరకు ఉంటేనే ఆ పార్టీల మధ్య పోటీ ఉన్నట్టుగా భావిస్తారు. ఈ లెక్కన 10 శాతం తేడా ఉందంటే బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీ ఏ దశలోనూ పోటీలో లేదనేది స్పష్టమవుతున్నది. ఇక బీజేపీ 16.3 శాతం ఓట్లతో అసుల సోదిలోనే లేదు.

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల్నే బీజేపీ కూడా చేసింది. అందుకే రాష్ట్రంలో ఆ పార్టీ బీఆర్ఎస్‌లాగా ఎదగలేకపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటే గెలిచినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో 4 సీట్లు సాధించింది. అలాగే హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచినప్పటికీ ఆ పార్టీ తన బలాన్ని ఎక్కువ కాలం కాపాడుకోలేకపోయింది. ఈ సారి జరిగే ఎన్నికల్లో అసలు రంగంలోనే లేకుండా పోయింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బలం ఉన్నప్పటికీ తెలంగాణను వ్యతిరేకించిన టీడీపీతో కలిసి పోటీ చేయడం వల్ల ప్రజల తిరస్కరణకు గురైంది. బీజేపీ మొదట ఓబీసీ రాగం అందుకున్నప్పటికీ ఇక్కడ బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌ని అధ్యక్షునిగా తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడం వల్ల బీజేపీకి నష్టం చేకూర్చింది. సీఎంగా కేసీఆర్‌ను 43 శాతం ప్రజలు కోరుకుంటుండగా, కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డిని 30 శాతం, బీజేపీ నుంచి బండి సంజయ్‌ని 11 శాతం, కిషన్‌రెడ్డిని కేవలం 4 శాతం ప్రజలు కోరుకుంటున్నారని ఇండియా టీవీ తన సర్వేలో వెల్లడించింది. తెలంగాణలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఇండియా టీవీ చర్చాగోష్ఠిలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు, ఎన్నికల విశ్లేషకులు తేల్చి చెప్పారు.

కేసీఆర్, ప్రభుత్వ పనితీరు భేష్

ఫ్యాక్ట్స్ మార్కెటింగ్ అండ్ రిసెర్చ్ సర్వీసెస్ సంస్థ.. సర్వేలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, సీఎంగా కేసీఆర్ పనితీరు, ప్రభుత్వ పనితీరుపైగా ఓటర్ల అభిప్రాయాన్ని సేకరించింది. సీఎంగా కేసీఆర్ పనితీరు బాగుందని, ప్రభుత్వ పనితీరు కూడా అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. సీఎం కేసీఆర్ పనితీరు చాలా బాగున్నదని 36.9 శాతం మంది అభిప్రాయపడగా మరో 37.2 శాతం మంది బాగున్నదని కితాబిచ్చారు. ఇక ప్రభుత్వ పనితీరు కూడా చాలా బాగున్నదని 31.9 శాతం మంది అభిప్రాయపడగా, బాగున్నదని 38.7శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ విధంగా మెజార్టీ ప్రజలు సీఎం కేసీఆర్‌ను, ప్రభుత్వ పనితీరును మెచ్చుకున్నారు.



ఏఎంఆర్ సంస్థల్లో ఐటీ సోదాలు

- **అధికారుల అదుపులో ఆ సంస్థ చైర్మన్ మహేశ్‌రెడ్డి**
- **బంజారాహిల్స్ చెక్‌పోస్టు వద్ద 3.50 కోట్లు స్వాధీనం**
- **12 చోట్ల ఐటీ, ఈసీ దాడులు**

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల తాయిలాలకు చెక్ పెట్టేందుకు శనివారం హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో రూ.3.5 కోట్లు పట్టుబడింది. బంజారాహిల్స్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన ఆ డబ్బుకు ఎలాంటి రశీదులు లేకపోవడంతో ఐటీ అధికారులకు అప్పగించారు. విచారణలో గ్రూపు చైర్మన్ మహేశ్‌రెడ్డి పేరు బయటికొచ్చింది. దీంతో ఆయన ఇండ్లు, గ్రూపు సంస్థలు, వ్యాపార సముదాయాలు సహా మొత్తం 12 చోట్ల సోదాలు చేపట్టారు. విలువైన పలు పత్రాలు, డిజిటల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మహేశ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు తెచ్చి కాంగ్రెస్‌కు ఇస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ నేత కారులో నోట్ల కట్టలు

- **చందుర్తి వద్ద తనిఖీల్లో పట్టుబడ్డ 5.90 లక్షల నగదు**

చందుర్తి, అక్టోబర్ 21: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో కాంగ్రెస్ నాయకుల వాహనాల్లో నోట్ల కట్టలు బయటపడుతున్నాయి. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మూడపల్లి వద్ద సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కాంగ్రెస్ ఎంపీటీసీ భర్త వేల్పుల దేవస్వామి కారును తనిఖీ చేయగా రూ.4.40 లక్షలు పట్టుబడ్డాయి. వాహనంలో నోట్ల కట్టలు వెలుగుచూడటంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. అలాగే.. ఆశిరెడ్డిపల్లికి చెందిన మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి వేములవాడ నుంచి ఆశిరెడ్డిపల్లికి వెళ్తుండగా రూ.1.50 లక్షలు పట్టుకున్నారు. పట్టుకున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్టు ఎస్సై అశోక్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో పలు చోట్ల రూ.36 లక్షలు సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి వద్ద కాంగ్రెస్ నేత కారులో దొరికిన నగదు

'గోల్డ్ కాయిన్' కేసులో మరో అరెస్టు

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): సమైక్య రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'గోల్డ్ కాయిన్' కేసులో మరో వ్యక్తిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. 2017 నుంచి తప్పించుకు తిరుగుతూ విజయవాడలో తలదాచుకున్న 17వ నిందితుడు (ఏ17) సంగిశెట్టి నాగ రవికుమార్‌ను శనివారం అదుపులోకి తీసుకొని, కోర్టుకు సరెండర్ చేశారు. 2008లో 'క్వెస్ట్ నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో కొందరు మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు తెరలేపారు. 33 వేలకే బంగారు నాణెం ఇస్తామంటూ, తొలుత రూ.460 చెల్లించాలని నమ్మబలికి అమాయకుల నుంచి భారీగా డబ్బులు దండుకున్నారు. తర్వాత వారికి నకిలీ నాణేలు ఇచ్చి మోసగించారు. ఈ కేసులో బెయిల్‌పై విడుదలైన నాగరవికుమార్ 2017 నుంచి కోర్టుకు హాజరవ్వట్లేదు. దీంతో అతనిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. సీఐడీ ఏడీజీ మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు ఎస్సీ రాంరెడ్డి నేతృత్వంలోని బృందం విజయవాడలో అదుపులోకి తీసుకున్నది.

చేపల ఎగుమతిలో మనమే టాప్

- **బండ ప్రకాశ్‌కు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్**
- **ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సత్యవతి రాథోడ్**

భూపాలపల్లిలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి. చిత్రంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ) : చేపల ఎగుమతిలో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో జడ్పీటీసీ జోరుక సదయ్య అధ్యక్షతన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి మంత్రి సత్యవతి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముదిరాజ్ కులస్థుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయడమే కాకుండా వారికి సబ్సిడీపై వాహనాలను అందించి ప్రోత్సహించినట్టు తెలిపారు. దీంతో తెలంగాణ చేపలను ఎగుమతి చేసే స్థాయికి చేరిందని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల అభ్యున్నతి గురించి ఆలోచించింది సీఎం కేసీఆర్ ఒక్కరేనని కొనియాడారు. ఇంతకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఓటు వేయాలంటూ వస్తున్నారని, వారు ఏం చేశారో నిలదీయాలని సూచించారు.

గండ్రకు వేసే ప్రతి ఓటు నాకు వేసినట్టే : బండా ప్రకాశ్

బీఆర్ఎస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి ముదిరాజ్‌లు వేసే ప్రతి ఓటు తనకు వేసినట్టుగా భావించాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. గండ్రతో తనకు 30 ఏండ్ల అనుబంధం ఉన్నదని అన్నారు. ఆయన అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు. తెలంగాణ రాక ముందు 2వేల సొసైటీలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 5వేలకు చేరిందని అన్నారు. కేసీఆర్‌తోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

36.55 కోట్లు మళ్లించేశారు!

- **ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ ఈ-చలానాల కుంభకోణం**
- **సొంత ఖాతాలోకి నిధులు తరలించిన గేట్‌వే సేవల కాంట్రాక్టర్ కొమ్మిరెడ్డి అవినాశ్**
- **నిందితుడు మాజీ డీజీపీ సాంబశివరావు అల్లుడే**

అవినాశ్ కుటుంబసభ్యుల కోసం గాలింపు

ఈ కుంభకోణంలో 'డాటా ఎవాల్వ్' సంస్థకు చెందిన కొత్తపల్లి రాజశేఖర్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కీలక నిందితుడైన అవినాశ్ పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. 'డాటా ఎవాల్వ్'లో డైరెక్టర్‌గా ఉన్న అవినాశ్ సోదరి అక్షిత, రవికిరణ్ కూడా ఈ కేసులో భాగస్వామ్యులుగా ఉన్నారని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. క్లోనింగ్ యాప్ ద్వారా మళ్లించిన సొమ్ము ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లిందనే విషయంపై విచారణ జరుగుతున్నదని పోలీసులు తెలిపారు.

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సాంబశివరావు అల్లుడు కొమ్మిరెడ్డి అవినాశ్ భారీ కుంభకోణానికి పాల్పడ్డాడు. ట్రాఫిక్ ఈ-చలానాల రూపంలో ఏపీ పోలీసులు వసూలు చేసిన సొమ్ము నుంచి ఏకంగా రూ.36.55 కోట్లను తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడు. దీంతో అవినాశ్‌తోపాటు ఆయన కంపెనీ 'డాటా ఎవాల్వ్'కు చెందిన ఆస్తుల క్రయవిక్రయాలను నిలిపివేయాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాశారు. ఏపీలో ట్రాఫిక్ పోలీసులు వసూలు చేసే జరిమానా సొమ్మును 4 పేమెంట్ గేట్‌వేల ద్వారా నేరుగా డీజీపీ ఖాతాలో జమ చేస్తారు. వాటిలో 'డాటా ఎవాల్వ్'కు చెందిన 'రేజర్ పే' గేట్‌వే ఒకటి. దీని నుంచి వెళ్లే సొమ్ము నేరుగా డీజీపీ ఖాతాలో జమ కాకుండా ఉండేలా ఆ యాప్‌ను క్లోనింగ్ చేశారు. 'రేజర్ పే' బదులుగా 'రేజర్ పేఈ' అనే యాప్‌ను రూపొందించారు. దీని ద్వారా గత ఐదేండ్లలో వసూలైన రూ.100 కోట్లకుపైగా జరిమానాలో రూ.36.55 కోట్లు నొక్కేసిన అవినాశ్.. మిగిలిన సొమ్మును ఎవరికీ అనుమానం రాకుండా డీజీపీ ఖాతాలో జమ చేసినట్టు తేలింది. 2017 జూన్ 27న అప్పటి ఏపీ డీజీపీ సాంబశివరావు 'డాటా ఎవాల్వ్'కు ఈ-చలానాల సర్వీస్ ప్రొవైడర్ బాధ్యతలను అప్పగించారు. ఆ సంస్థ కేవలం రూ.1కే కోట్ చేయడంతో కాంట్రాక్టు ఇచ్చినట్టు అప్పట్లో పేర్కొన్నారు.

స్కాం బయటపడింది ఇలా..

తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ నర్సప్ప తన యూనిట్ నుంచి రోజూ ఎంత మొత్తం వసూలు అవుతున్నదన్న విషయంపై ఆరా తీశారు. ఈ క్రమంలో మొదటి రోజు చూసిన మొత్తానికి, 4 రోజుల తర్వాత చూసిన మొత్తానికి తేడా కనిపించింది. అనంతరం ఈ ఏడాది మే 1 నుంచి 20 వరకు జరిగిన అన్ని లావాదేవీల్లో తేడా ఉన్నట్టు గమనించడంతో డీఎస్పీ నర్సప్ప ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే అంతర్గత విచారణ జరపడంతో కుంభకోణం బయటపడింది.

బతుకమ్మ వేడుకల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. శనివారం చార్మినార్ వద్ద బతుకమ్మ సంబరాల్లో హిందువులతో కలిసి ముస్లిం మహిళలు బతుకమ్మ ఆడారు.

పోలీస్ అమరుల త్యాగాలు అజరామరం

- **త్యాగాలతో అద్భుత విజయాలు**
- **మన పోలీస్ దేశంలోనే నంబర్1**
- **రాష్ట్రంలో క్రైమ్‌రేట్ తగ్గుముఖం: డీజీపీ అంజనీకుమార్ వెల్లడి**
- **ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం**

పోలీస్ అమరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న డీజీపీ అంజనీకుమార్

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): పోలీస్ అమరవీరుల త్యాగాలు అజరామరమని డీజీపీ అంజనీకుమార్ కొనియాడారు. హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేడియంలో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల స్థూపం వద్ద డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. దేశరక్షణ కోసం ఎందరో పోలీసులు త్యాగాలు చేశారని, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 189 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. గొప్ప త్యాగాల నుంచే అద్భుత విజయాలు ఉద్భవిస్తాయని ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఎన్నో పోలీస్ సేవలకు తెలంగాణ పోలీసులే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, జాబ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్లలో రాష్ట్ర పోలీస్ విభాగం నాలుగేండ్లుగా దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నదని తెలిపారు. క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్) అమలులో 99 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచినట్టు చెప్పారు. దేశంలోనే అత్యధికంగా సీసీ కెమెరాల వ్యవస్థ మన రాష్ట్రంలో ఉన్నదని, దాంతో ఎన్నో నేరాలను పరిష్కరించేందుకు వీలు దొరుకుతుందని చెప్పారు. తెలంగాణ షీటీమ్స్, భరోసా సెంటర్లు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. నూతన పోలీస్ సంస్కరణల వల్ల రాష్ట్రంలో క్రైమ్‌రేట్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతున్న అన్ని విభాగాల పోలీసులకు డీజీపీ సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్, నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య, జాతీయ భద్రతా మాజీ సలహాదారు ఎన్‌కే నారాయణన్, అడిషనల్ డీజీలు సౌమ్యా మిశ్రా, శివధర్‌రెడ్డి, సంజయ్ కుమార్‌జైన్, అనిల్‌కుమార్, మహేశ్ భాగవత్, శ్రీనివాసరెడ్డి, పలువురు పోలీసు ఉన్నతాధికారులు, పోలీస్ అమరుల కుటుంబాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

లాడ్లీ అవార్డుతో 'నమస్తే తెలంగాణ' జర్నలిస్టు ఇంద్రగంటి లక్ష్మీహరిత

'నమస్తే' జర్నలిస్ట్‌కు లాడ్లీ అవార్డ్

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): జర్నలిజంలో ప్రతిష్ఠాత్మక పురస్కారంగా భావించే లాడ్లీ అవార్డు 'నమస్తే తెలంగాణ' పాత్రికేయురాల్ని వరించింది. సంస్థలో సీనియర్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న ఇంద్రగంటి లక్ష్మీహరిత రాసిన మహిళా సాధికారికతకు సంబంధించిన స్ఫూర్తిదాయక కథనానికి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. మగువ తెగువకు అద్దంపట్టే ఫీచర్ పేజీ 'జిందగీ' కోసం పనిచేస్తున్న లక్ష్మీహరిత.. మానవీయ కథనాలు, మహిళా విజయ గాథలు ఎన్నో రాశారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి లాడ్లీ నిర్వహించిన పోటీల్లో 'ఆమె గెలిచింది.. జజ్జీగా నిలిచింది' శీర్షికన లక్ష్మీహరిత రాసిన సివిల్ జజ్జీ మంజుల స్ఫూర్తిదాయక కథనం 'బెస్ట్ తెలుగు ఫీచర్ స్టోరీ' ఎంపికయ్యింది.